# పాము

★

శ్రీ త్రిపుర

శేషాచలపతిరావ్ అద్దంలో చూస్తూ దువ్వుకుంటూ "ఇవాళ నీపేరు అలఖ్ నిరంజన్" అని చెప్పేడు అద్దంలోని శేషాచలపతిరావ్‌తో. అద్దంలోని శేషా.... నవ్వి "గొప్ప మజా, స్కాండ్రల్, నీ సంగతేం చెప్పను. అవును కానీ, నీకు ఎడం పాపిడేమీ బాగులేదు ఇవాళ. కుడిపాపిడిలాగు. టై నాట్ కింద డింపుల్ బాగులేదు. షోల్డర్స్ ఇంకా స్క్వేర్ చెయ్యి" అన్నాడు.

విండ్సర్ నాట్ కింద డింపుల్‌దిద్ది, పాపిడి కుడిచేసి, మళ్లీ బ్రష్‌చేసి, బుగ్గల్లోని డింపుల్స్ ప్రాక్టీస్‌చేసి, అద్దం పక్కని పిన్‌చేసి ఉంచిన క్లాస్‌రొటీన్ చూశాడు.

"మొదటి రెండు పీరియడ్సూ ఉండాలి. మూడూ, నాలుగూ స్కిప్ చెయ్యొచ్చు."

హాస్టల్ గేటు దాటుతూ "పవర్, ట్రెచరీ, ఎడ్వెంచర్. నేను నేతాజీని, హిట్లర్‌ని. వినండి, బుద్ధిలేని, బలంలేని బాస్టర్డ్స్.... మిమ్మల్ని హతమార్చేస్తాను. పారాహుషార్.... లక లలక్షలుగా క్రిముల్లాగ బతుకుతున్న మిమ్మల్ని రూపురేఖలు లేకుండా చేస్తాను...." పిడికిలి బిగపట్టి, హాస్టల్ వేపు కాలేజీ వైపు చూపించి గట్టిగా చెయ్యి ఊపేడు.

జోరుగా వచ్చే రిక్షాని తప్పించుకుని హిందీలో బూతులు తిట్టేడు.

'మొదటి రెండు పీరియడ్స్ కూడా స్కిప్ చెయ్యొచ్చు. దశాశ్వ మేథ్ ఘాట్‌కి వెళ్తాను' అని అనుకుంటూనే లైబ్రరీ వేపు తిరిగి, 'అలఖ్ నిరంజన్! నిన్ను.. నన్నే.. నేను డిసీవ్ చెయ్యగలను తెలుసా' అని లైబ్రరీవేపు నడవడం మొదలు పెట్టేడు.

సెక్షన్ లైబ్రేరియన్ టేబుల్‌మీద గుట్టలు గుట్టలుగా రిబైండ్ చేసిన పుస్తకాలు పేర్లు రెజిస్టర్‌లో రాసుకుంటున్నాడు. నేరుగా లోపలికి పోయి బీరువాల్లో పుస్తకాల టైటిల్స్ చూడడం మొదలు పెట్టేడు అలఖ్ నిరంజన్.

చీర రెపరెపలు.

సున్నితంగా మాటలు.

కంటి చివర నుంచి చూస్తే, సెక్షన్ లైబ్రేరియన్ టేబుల్‌మీద వేళ్ళు. లేడి.... జింక.... డీర్.

ముఖం తిప్పి చూసేడు.

తనవేపే చూస్తూంది ఉమాడే.

అప్రయత్నంగా కళ్లతో నవ్వేడు అలఖ్, అప్రయత్నంగా కళ్లతో నవ్వడం అలవాటు చేసుకున్న నిరంజన్.

హిందీలో అంది : నా కార్డ్ మరిచిపోయాను. శనివారం త్రివేదీ సెమినార్‌లో ఎస్సే సబ్మిట్ చెయ్యాలి. మీ కార్డ్ మీద ఛాసర్‌మీద బుక్స్ ఏమేనా ఇప్పిస్తారా ?

ఆ క్షణంలో చిరునవ్వు మాయమయిపోయింది. నిరంజన్ కళ్లల్లో, క్షణంలో కళ్లల్లోని నవ్వుని మాయం చెయ్యడం అలవాటు చేసుకున్న అలఖ్ కళ్లల్లో : ఇంగ్లీషులో అన్నాడు : కారిడార్ లోకి రండి.

గాజు అద్దాల కిటికీ దగ్గరగా వెళ్లి, వెనక్కి తిరిగి, కోపంగా అన్నాడు, "నా కార్డ్ ఎప్పుడూ జేబులో పెట్టుకుని తిరగను. మీ రెవరో నా కింకా బాగా తెలియదు. తెలియని ఆడవాళ్లందరికీ సహాయంచేసే షివల్రస్ మనిషిని కాను."

ఉమా కళ్లల్లో మెఱుపులాగ కోపం .....

"ఇవ్వలేకపోతే యివ్వనని మృదువుగా చెప్పొచ్చు. గొంతుకలో అంత థండర్ అవసరంలేదు."

విసురుగా చీర మెఱుపు మాయమయింది.

మళ్లీ తెర ఎత్తబడింది. తను అనుకోకుండానే, అకస్మాత్తుగా. అయితే, తన భవిష్యత్తుకి ఆకారం తానే యిస్తాడు. ఇప్పుడు జరుగుతున్నది తను ఎప్పుడో ఊహించి మనస్సు మారుమూలల్లో తొక్కి పడేసి ఉంచిన నాటకంలోని ఒక భాగం.

తెర ఎత్తేసింది కాలం, కాస్త ముందుగానే.

అయితే తను ఎప్పుడూ సిద్ధమే.

'జగదేవ్ .... జగదేవ్ ! .... '

'జీ.'

'ఈ అల్మైరా తాళాలియ్యి.'

తాళాలు తీసుకుని బీరువా తెరిచి రెండు పుస్తకాల తిరగేశాడు.

జగదేవ్ అక్కడే నిలబడ్డాడు.

ఒక చివరన షర్‌వుడ్ నావల్ ఒకటి కనిపించింది.

'ఇదిగో. నువ్వు అన్ని రకాల మనుషులికీ తాళా లిచ్చే స్త్రావ్. ఎలా అడ్డదిడ్డంగా పెట్టేశారో చూడు. ఈ పుస్తకం యిక్కడేమిటి చేస్తూంది. తీసుకువెళ్లి ఫిక్షన్‌లో పెట్టు. నీకు బుద్ధిరాదు. ఎన్నిసార్లు లైబ్రేరియన్‌చేత తిట్లు తిన్నా.'

జగదేవ్ గొణుక్కుంటూ పుస్తకం తీసుకుపోయేడు.

—

అల్మైరాలోంచి ఛాసర్‌మీద లెగూయీ రాసిన పుస్తకం పైకి తీసేడు. కోట్ పక్కకి లాగి, షర్ట్‌కీ, బెల్ట్‌కీ మధ్య పుస్తకాన్ని తోసి, మళ్లీ కోటు గుండీలు పెట్టాడు. ఎడం చెయ్యి అడ్డంగా పెట్టుకుని జగదేవ్‌ని పిలిచి తాళాలు యిచ్చే శాడు.

కౌంటర్ దగ్గర :

"పండిట్జీ, ఇంకా కాస్త విజిలెంట్‌గా ఉండాలి. పుస్త కాల దొంగలు ఎక్కువయి పోయారు. ఇవాళ నాకు కావలసినవి ఒకటీ కనిపించలేదు. ఇష్యూ కూడా అవలేదు. మీరింత ఇనెఫి షెంట్‌గా ఉంటే మేము కంప్లెయిన్ చెయ్యవలసొస్తుంది." కోపంగా, వికెట్ లోసుకుని విసురుగా పైకి వచ్చేశాడు అలఖ్ నిరంజన్.

లైబ్రరీ దగ్గర చెట్టుకింద కేంటీన్.

చెట్టుకింద బల్లమీద కూర్చుని నాలుగు సమోసాలు తిని, టీ తాగుతూ చుట్టూ ముసిరే ఎఱ్ఱ కందిరీగల్ని ఛాసర్‌తో అప్పటికే ఆరు చంపేడు.

'ఇంకో అయిదు నిముషాల్లోపల ఉమ పైకి రావాలి .... వచ్చితీరాలి' అనుకున్నాడు. రిస్ట్‌వాచ్ విప్పి చేత్తో పట్టు కున్నాడు. సాసర్ బల్లమీద ఉంచి, కప్ మాత్రం చేత్తో పట్టుకుని లైబ్రరీవేపు తిరిగి నిలబడ్డాడు..... నాలుగు నిము షాల నలభయి సెకండ్లు ...... నలభయి ఐదు ...... ఏభయి .... ఏభయి ఎనిమిది ....

అయిదు నిముషాలు.

ఉమ లైబ్రరీ మెట్లు దిగి వస్తూంది. దగ్గరగా వచ్చింది.

'హలో. మీరు రెండు సెకండ్లు ఆలస్యం. చూశారా. స్టాప్ వాచ్‌లాగ పట్టుకుని ఎలా లెక్కపెట్టున్నానో. ఈసారికి క్షమించేను .... రండి. మేనర్స్ గురించి బాధపడితే మీకు కావా ల్సిన బుక్ దొరకదు. మీ హృదయంలోని మిక్స్డ్ ఫీలింగ్స్ నాకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయినా ......

ముందుకు, దగ్గరగా అడుగు వేసింది ఉమ.

'.... అయినా, మీరు ఒప్పుకుంటారు .... రండి.'

ఉమ నవ్వింది. బెంచ్‌మీద కూర్చుంది.

'గులాబ్‌జామున్ కూడా చేశాడు శర్మాజీ. స్వీట్స్ అంటే అసహ్యం నాకు. స్వీట్స్ అంటే ఇష్టపడేవాళ్లని మెషిన్ గన్‌తో షూట్ చేద్దామనిపిస్తుంది. కాబట్టి సమోసాలు. ఏమం టారు. అండ్ టీ .... ఇదిగో మీకు కావలసిన పుస్తకం. మన ఫ్యూచర్ అసోసియేషన్‌కి చిహ్నంగా యీ ఆరు కందిరీగల కళే బరాల్ని ఛాసర్‌తో చంపి సిద్ధంగా ఉంచేను...... వద్దు. మీరు మాట్లాడడానికి ప్రయత్నించకండి. నేనే అంతా మాట్లాడేసిన తరువాత మీకు అవకాశం యిస్తాను .... మీరు నాకు జూనియర్. మీపేరు ఉమాడే. గౌహతిలో బి. ఏ. చదివేరు. ఇక్కడ బెంగాలీ టోలాలో అంకుల్ దగ్గర ఉన్నారు..... తరువాత, నాసంగతి బెలూచిస్తాన్, జర్మనీ నా స్పిరిట్యుయల్ హోమ్స్. ఇంఫాల్‌లో ఫోర్టీన్త్ ఆర్మీలో పని చేశాను, కెప్టెన్‌గా. కోర్ట్ మార్షల్ చేసేరు కారణాంతరాలవల్ల. ఇక్కడ—ముప్పయి సంవత్సరాల వయస్సులో—యూనివర్సిటీలో చదవడానికి కారణాలు :

ఒక్కొక్క వేలూ ముడుస్తూ చెప్పేడు.

" .... ఒకటి: నాకు హోమ్ లేదు. బంధువులు లేరు. రెండు ! ఉద్యోగాలు చెయ్యడానికి కావలసిన టెంపరమెంట్ లేదు. మూడు : హోటల్స్‌లో ఎప్పుడూ ఉండడానికి కావల సిన డబ్బు లేదు. నాలుగు : యూనివర్సిటీలో చదువు నా ఎస్టి మేట్ ప్రకారం చాలా చవక.

"చూశారా .... నాలుగు నిముషాల్లో, నాలుగు నెలల పరి చయం అయితేగాని తెలియని విషయాలన్నీ చెప్పేశాను. కాలానికి ఏదీ వదిలెయ్యకూడదు .... "

సమోసాలు, టీ వచ్చాయి.

ఉమ తినడం మొదలుపెట్టింది.

"రిమార్కబుల్ ! మీరు చాలా డెలికేట్‌గా రెండు వేళ్లతో సమోసాలని చిన్న చిన్న ముక్కలు చేసి గ్రేస్‌ఫుల్‌గా నోట్లో పెట్టుకుని అవి బాధతో ఏడుస్తాయేమో అన్న భయంతో మెల్లమెల్లగా తినడం అలవాటు చేసుకోలేదు. ఎడ్మి రబుల్."

సమోసాలు అయిపోయాయి.

"ఇప్పుడు మీరు మాట్లాడొచ్చు."

"మీరు విచిత్రమయిన వ్యక్తులు. అన్ని విషయాలు చెప్పేరుగాని మీ దగ్గర లైబ్రరీ కార్డ్ లేకుండానే యీ పుస్తకం ఎలా తెచ్చారో చెప్పలేదు." కుడిచేతివేళ్ల గోళ్లతో బెంచ్‌మీద వరసగా చప్పుడు చెయ్యడం మొదలుపెట్టేడు.

"హార్స్ రైడింగ్ యిన్ చండికా .... చాలాకాలం క్రింద చండిక ఆనే ఫిల్మ్ చూశాను. అందులో గుర్రాలు పరుగెట్టుంటే యిదే చప్పుడు. చండికా ఆన్ హార్స్ బేక్ ..... ఐదడుగుల పద కొండున్నర అంగుళాల పొడవూ, నూట ఎనభయి పౌన్ల బరువూ మనిషిని. ఈ పది ఔన్సుల బరువు పుస్తకాన్ని తేడానికి లైబ్రరీ కార్డ్ ఉండాలా ? .... ఇస్యూ కౌంటర్ దగ్గర పండిట్జీ బాగా తెలుసులెండి. అడిగి తెచ్చాను. మీరు నాలుగు రోజా లుంచుకుని నాకు తిరిగి యిచ్చేయండి."

ఉమ తెలివైనపిల్ల.

అంది : నన్నొకమాట చెప్పనిస్తారా. మీరు చాలా నెర్వస్ మనుష్యులనుకుంటాను. దాన్ని కప్పిపుచ్చడానికి ఈవిధంగా మాట్లాడుతారు .... అంతేనా ? ఉమ కళ్లల్లోకి సూటిగా, తీవ్రంగా చూశాడు నిరంజన్.

'మీరు సైకాలజీ పుస్తకాలు చదివినట్లున్నారు. లేక పోతే ఎవరో అంటే విన్నారు. అంత సులభంగా లేబుల్ అంటించకండి. మీ మంచికి చెప్తున్నాను. నేను డేం .... జ .... ర .... స్ మనిషిని.'

'శర్మాజీ !'

రూపాయినోటు యిచ్చి చిల్లర తీసుకున్నాడు.

'నన్ను మరచిపొండి. ఈ సెప్టెంబర్ వెదర్ నన్ను సర దాగా మాట్లాడ్డానికి ప్రోత్సహించింది. అంతే. మీ కింకా చిన్న వయస్సు. గుఢ్‌బై.' లేచి, గిరుక్కున తిరిగి పెద్ద పెద్ద అడు గులు వేస్తూ బిర్లా హాస్టల్‌వేపు నడిచిపోయాడు, అలా పెద్ద పెద్ద అడుగులు వేస్తూ నడవడం అలవాటయిపోయిన అలఖ్‌కి.

బ్రోచా హాస్టల్ దగ్గర బస్ ఎక్కేడు. ఖాళీగా ఉంది.

గోడో లియాకి రెండు టిక్కట్లు అడిగేడు.

'ఒక్కడికే రెండెందుకూ' అడిగేడు కండక్టర్.

'అది నీ కవసరంలేదు. ఒకటి నాకూ, రెండోది నా స్పిరిట్‌కీ' అన్నాడు అలఖ్.

రూయా హాస్టల్ స్టాప్ దగ్గర అమెరికన్స్‌లా కనిపించే ఒక జంట ఎక్కేరు. అతను లావుగా, పొట్టిగా : ఆమె సన్నగా, పొడుగ్గా, అందంగా.

'లైకే క్వీన్' అనుకున్నాడు. క్రిందటి సాయంత్రం సాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఒక పెద్ద గ్రూప్ దిగిందిట. ఆ గ్రూప్ లోని వాళ్లే గాబోలు అనుకున్నాడు.

కండక్టర్‌తో 'గేంజీస్‌కి టికెట్స్' అన్నారు వాళ్లు.

కండక్టర్‌కి బోధపడలేదు.

'గొడోలియాకి యియ్యి' అన్నాడు అలఖ్.

వాళ్లవేపు చూసి అన్నాడు : 'మీకు యిష్టమయితే సహాయం చెయ్యగలను. నేనుగూడా గేంజీస్ వేపే వెళ్తున్నాను.'

థేంక్స్‌తో ఉక్కిరిబిక్కిరిచేసిన తరువాత అన్నారు : 'గ్రూప్‌లో తిరగడం థ్రిలింగ్‌గా ఉండదు మాకు. అందుకే ముందుగా బయలుదేరేము. లక్కీగా నువ్వు కలిసేవు.'

'నువ్వు హిందూవేనా ? ఇజిప్షన్‌లాగో, స్పెనియర్డ్‌లాగో ఉన్నావు.' అని అడిగేడు మగ అమెరికన్.

పరిచయం చేసేడు : 'నా పేరు జేమ్స్ ఎలియట్, ఈమె మిసెస్ ఎలియట్ .... క్వీనీ ఎలియట్.'

'లైకే క్వీన్ !' నిజమే, అనుకున్నాడు నిరంజన్.

'నేను హిందూని కాను. ముస్లిమ్‌ని. నా పేరు బైరాంఖాన్.

మీరు గేంజీస్ చూడొచ్చు. కాని టెంపుల్స్‌లోకి రానీ యరు.'

'ఇదిగో యిక్కడే దిగాలి.'

క్వీనీ దిగడానికి తన చెయ్యి యిచ్చి సహాయం చేశాడు.

ముగ్గురూ దశాశ్వమేథ్ వేపు నడచేరు.

జేమ్స్, క్వీనీ దృశ్యాల్ని 'త్రాగుతున్నారు.'

లస్సీ దుకాణంలో బెంచ్‌మీద కూర్చున్నారు.

ఛోక్రాని పిలిచి "మూడు గ్లాస్‌లు తీసుకురా. బాగా భంగ్ కలుపు" అన్నాడు.

అప్పుడే కలలోంచి లేచి ప్రపంచాన్ని కొత్త కళ్లతో చూస్తున్నట్లు చూస్తున్నాడు, జేమ్స్ గుంపులుగా రోడ్‌మీద నడిచే ఇండియన్ ప్రజల్నీ, టాంగాల్నీ, ఎక్కాల్నీ.

క్వీనీ మధురమైన స్వరంతో, 'నువ్వు యూనివర్సిటీలో చదువుతున్నావా ?' అని అడిగింది.

"ఇక్కడ యూనివర్సిటీలో యిడియట్స్ తప్ప ఎవరూ చదవరు. నేను తోళ్ల వర్తకం చేస్తాను. యూనివర్సిటీ డైరీలో ముసలి ఆవులు చేరానికొస్తే కొనడానికి వచ్చేను. నాది మీర్జాపూర్ హెడ్‌క్వార్టర్స్.'

ఛోక్రా లస్సీ తెచ్చి టేబుల్‌మీద పెట్టేడు.

'ఇందులో భంగ్ వేయించేను. చాలా థ్రిల్లింగ్ డ్రింక్' అని, జేమ్స్ చెవిలో ఏదో అన్నాడు. జేమ్స్ మొదట షాక్ అయి, తరువాత ఏమనాలో తెలియక నవ్వేడు.

లస్సీ మెల్లగా తాగేరు ముగ్గురూ.

జేమ్స్ ఎంతయిందో అడిగి, జేబులోంచి వాలెట్ తీసి, మెల్లగా కూడబలుకుతూ లెఖ్ఖపెట్టి యిచ్చేడు. వాలెట్ లావుగా, నోట్లతో వానాకాలం కప్పలాగుంది.

'పదండి గేంజిన్ దగ్గరకు పోదాం.'

ఘాట్ వేపు నడచేరు.

వెల్లువతో గంగానది బురదనీరు ఉరకలేస్తూ ప్రవహిస్తూంది. విజృంభించి మెట్లమీద కెరటాలు పగిలి సుడిగా వెనక్కి తిరుగుతున్నాయి.

"క్రాస్ చేద్దామా."

"వయొలెంట్‌గా ఉన్నట్లుంది. అవేనా బోట్స్ ? చాలా ఫ్లిమ్సీగా కనిపిస్తున్నాయి" అన్నాడు జేమ్స్.

"ఏమీ భయంలేదు. ఇంతకంటే వరద ఎక్కువ ఉన్నప్పుడు కూడా తీసుకుపోతారు యీ పడవవాళ్లు. పోనీ డౌన్ స్ట్రీమ్ పోదామా ?"

జేమ్స్ ముఖంలో భయం. 'వద్దు. రిస్క్ తీసుకోవడం మంచిదికాదు. క్వీనీ కూడా ఉంది.'

థ్రిల్స్ కావాలి నీకు. కవర్డ్.

'సరే, నీ కేమేనా బనారస్ బ్రోకేడ్స్ కావాలా' అడిగేడు క్వీనీని.

క్వీనీ ముఖంలో సంతోషం. 'చాలా కొందామని ఉంది. ఆ దుకాణాలకి తీసుకువెళ్ల .... ప్లీజ్."

విశ్వనాథ్ గల్లీలోకి తీసుకువెళ్తూ ఆగేడు అలఖ్.

జేమ్స్‌తో అన్నాడు : ఇక్కడ జేబుదొంగలు ఎక్కువ. మీ దగ్గర వాలెట్ ఉంచడం మంచిదికాదు. ఇక్కడ జేబు కొట్టేవాళ్లందరూ నాకు తెలుసు. వాలెట్ నా దగ్గరుంచితే ఏ భయమూ లేదు."

జేమ్స్ తొందరగా కోట్ లోపలి జేబులోంచి వాలెట్ తీసి అలఖ్ కి యిస్తూ : "ముందే చెప్పినందుకు చాలా థేంక్స్' అన్నాడు.

గల్లీలోకి వెళ్లారు.

చాలా రద్దీగా ఉంది. క్వీనీ దుకాణాల్లో వేళ్లాడగట్టిన చీరెల్నీ కంచు, యిత్తడి సామానుల్నీ ఆశ్చర్యంగా చూస్తూంది.

జేమ్స్ పొట్టి కాళ్లతో వెనుక నడుస్తున్నాడు.

దుకాణాల సేల్ లు కాకుల్లాగ పిలుస్తున్నారు.

బీహారీ పల్లెటూరు గుంపొకటి గొడవచేస్తూ ముందు నడుస్తూంది.

ఆబోతు ఎదురుగా, ఱంకెవేస్తూ వేగంగా దూసుకుంటూ పరుగెత్తుతూ వచ్చింది.

బీహారీ గుంపు అరుచుకుంటూ చెదరిపోయి వెనక్కీ ముందుకూ గోల పెటుతూ పరుగెడ్తూంటే ....

'రన్' అని గట్టిగా అరిచి,

ఇద్దరి చేతులూ పట్టుకుని పరుగెత్తేడు.

'వాట్ ద హెల్ యీస్ ద మేటర్ నా" అంటూ పొట్టి కాళ్ల జేమ్స్ చెయ్యి విదిలించుకుంటూ అడిగేడు.

'శ్ .... హిందూ ముస్లిమ్ రయట్.' క్వీనీ చెయ్యి పట్టుకుని పరుగెత్తుతూనే ఉన్నాడు.

బీహారీ మూక మధ్య జొరబడ్డారు.

క్వీనీ చెయ్యి కూడా వదిలి అలఖ్ ఇంకా వేగంగా ముందుకు దూసుకుపోయి గల్లీలోంచి పైకి పోయాడు.

చౌక్‌లోంచి కట్‌చేసి యింకో చిన్న గల్లీలో జొరబడి 'సంగమ్' బార్ చేరుకున్నాడు.

గట్టిగా వూపిరి బిగించి ఒక నిముషం నిలబడ్డాడు. పేంట్ జేబులో చెయ్యి పెట్టి బరువుగా, దబ్బగా ఉన్న వాలెట్‌ని సంతృప్తిగా తడిమేడు. వాలెట్ పైకి తీసి, నోట్లు పైకి లాగి, వాలెట్‌ని కాలవలో విసిరేశాడు. బార్ లోపల అడుగు పెట్టేడు. సగం బార్ నిశ్శబ్దంగా ఉంది. హాల్ అద్దంలో జుత్తు దువ్వుకుని, రుమాలుతో ముఖం తుడుచ్చుకున్నాడు. జేబులో నోట్లు మళ్లీ చూసుకున్నాడు. అర వయికి పైగా పది రూపాయల నోట్లు. అద్దంలో చూస్తూ, కుడికన్ను గట్టిగా మూసి నాలిక పైకి పెట్టి మళ్లీ లోపలికి మడిచి, ఎడంచెయ్యి చూపుడువేలు పెదవులమీద నిలువుగా నిలిపి మెల్లగా అన్నాడు, "ఎవరికీ చెప్పొద్దు .... సక్కర్స్."

బార్‌లో నిశ్శబ్దం. బూత్స్‌లో తొంగిచూస్తే ఎవరూ లేరు. పక్క గదిలో బెనర్జీ డెస్క్ దగ్గరికి వెళ్లాడు. కునుకు తీస్తున్నాడు బెనర్జీ, డెస్క్‌మీద ముఖం పెట్టుకుని. చప్పుడు చెయ్యకుండా డెస్క్‌మీద తాళాలు తీసి, వెనక గదిలోకి వెళ్లి బీరువా తెరిచేడు. కింద అరలో కార్రూన్‌జిన్ బాటిల్ తీశాడు. బెనర్జీ దగ్గరకు వచ్చేడు. డెస్క్‌మీద వంగి బెనర్జీ వీపుమీద గట్టిగా చరిచేడు. ఉలిక్కిపడి కోపంగా, బాధగా, భయంగా, అర్థంలేని అరుపులు అరుస్తూ లేచాడు బెనర్జీ.

కళ్లు రెపరెప లాడించి శేషాచలపతిని చూసి బెంగాలీలో అన్నాడు :

'అబ్బ. ఎంత దెబ్బ కొట్టేవు. రావుబాబూ. ఇంత మిట్ట మధ్యాహ్నం వచ్చేవేమిటి. ఎవరూ లేరు కుర్రాళ్ళు.'

'నువ్వు యిలా తలుపులు తీసిపెట్టి కునుకు తీస్తుంటే లిక్కర్ స్టోర్ అంతా ఖాళీ అవుతుంది. ఒక గంటలోనే. ఐస్ ఉందేమో చూడు." బెనర్జీ లోపలికి వెళ్లాడు ఐస్ కోసం.

అలఖ్ అక్కడే సోఫాలో కూర్చుని బాటిల్ మూత తీసేడు.

బెనర్జీ ట్రేలో ఐస్, వైన్ గ్లాస్‌లు, నిమ్మకాయలు పట్టుకొచ్చాడు. గ్లాస్‌లలో మూడు పెగ్‌లు జిన్ పోసి ఐస్ ముక్కలు వేసి బెనర్జీ కొకటి యిచ్చి, తను సిప్ చెయ్యడం మొదలు పెట్టేడు.

బెనర్జీ గడగడ తాగేసి గ్లాస్ ఖాళీచేసి మాట్లాడడానికి గొంతు సవరించుకుంటుంటే, 'మాట్లాడొద్దు. నన్ను వదిలి నీ పని నువ్వు చూసుకో—అంటే, మళ్లీ ముఖం డెస్కుమీద పెట్టి పడుకో! అన్నాడు అలఖ్.

బెనర్జీ కళ్ళు మూసుకునే చిరునవ్వు నవ్వి తిరిగి సమాధి లోకి వెళ్లిపోయాడు. ....

కుడి జేబులో ఆరు వందల రూపాయలు. ఎడం జేబులో ఉమాడేకి జాగా. సెంటిమెంటల్ మూడ్‌లోకి పోవచ్చు.

" .... .... బాల్యం .... బాల్యపు అనుభూతులు .... బాల్యం నన్ను విరామం లేకుండా మెత్తగా వెంటాడుతూంది. ఏళ్ళు గడచిన కొలదీ, ఎడారిలాంటి 'యధార్థం' గుండెలో బలమైన వ్రేళ్లతో పాతుకుపోయి స్థిరపడ్డకొలదీ, .... నా వెనకనే నీడలా వచ్చి వీపుమీద పచ్చటి వేళ్లతో తట్టి పిలుస్తున్నా రెవరో .... జీవితానికి అర్థంలేదు, అంతా శూన్యం అని తెలుస్తున్న కొలదీ, నా పూర్ణ శక్తితో వెనక్కి .... వెనక్కి పరుగెడుదా మనుకొంటాను .... తిరిగీ, నా బాల్యంలోకి ..... క్షణానికీ, క్షణానికీ, క్రియకీ, క్రియకీ సంబంధంలేకుండా బ్రతకడం .....

పవర్, ప్రెచరీ .....

జిన్ కైపు ఎక్కుస్తుంటే వాచాలత్వం, దెబ్బలాడడం సోపానాలు స్కిప్ చేసి సెంటిమెంటల్ మూడ్‌లో ప్రవేశించి అందులోంచి మెల్లగా జరిగి, కళ్ల నీళ్ల ప్రవాహంలో పడ్డాడు.

సాయంకాలం ఏడు గంటలకు యింకా కొంచెం మత్తు ఉండగానే, మెల్లగా తూలుకుంటూ హాస్టల్ చేరుకున్నాడు శేషాచలపతి.

బట్టలన్నీ విప్పేసి, నగ్నంగా మంచంమీద పడుకొని, పది నిముషాల తరువాత చల్లటి నీరుతో ముఖం కడుక్కుని, అద్దంలో చూసుకుంటూ "ఎలా ఉంది, అలఖ్ నిరంజన్, యీ దినం ?" అని అడిగేడు అద్దంలోని శేషాచలపతిని.

"రేపు నీ పేరు సాల్వడార్ డాలీ. ఏం చేస్తావో" అని అద్దంలోని శేషాచలపతి వివపు నవ్వు ఒకటి మధురంగా నవ్వేడు.

---

ఉ. నన్నయ తిక్కనాది రసనల్ గురియించిన చాటుధార లీ
మన్నన నింకఁబోలు; నణుమాత్రము తద్రస మబ్బదెందుహో !
జున్నలలోనఁ జిన్నిపువు జున్నెటు లట్టులు పద్దియంబులన్
మిన్నలు చాటువుల్ రససమృద్ధి ననిర్వచనీయ మాధురిన్.

ఉ. గౌతమిఁ గట్టి కాలువలు కాటను ద్రవ్వెన కాలమందు సం
భూతుఁడనైతి నాఁడు, పదుమూఁడగు నేఁడుల యీడు తల్లికిన్ !
మాతకులేమి బాల చట మంటిని మోసెడు యుప్పరమ్మలే
ప్రీతిని నన్నుఁ జన్గుడిపి పెంచిర దేటి ఋణానుబంధమో!

—వసురాయకవి